రక్తమోడుతున్న రహదారులు

ఇటీవల జాతీయ రహదారిపై బోల్తా పడిన టాటా మ్యాజిక్

- రెప్పపాటులో గాల్లో కలుస్తున్న నిండు ప్రాణాలు
- డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, ఓవర్ టేక్‌తో మృత్యువాత పడుతున్న వాహనదారులు
- వరంగల్ కమిషనరేట్ పరిధిలో 10 నెలల్లో 1146 రోడ్డు ప్రమాదాలు
- 354 మంది మృతి.. 71మందికి తీవ్ర గాయాలు

సుబేదారి, నవంబర్ 17 : మద్యం మత్తు.. మితిమీరిన వేగం.. ఓవర్ టేక్.. నిద్ర మత్తు .. సెల్ ఫోన్ డ్రైవింగ్.. వెరసి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదార్లు రక్తమోడుతున్నాయి. నిండు ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈ మధ్య ప్రతి రోజు ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదం జరిగి ఒకరో, ఇద్దరో మృత్యువాత పడుతున్నారు. ఎక్కువగా తెల్లవారు జామున, రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తున్నది. గత ఏడాది కంటే ఈ ఏడాది పది నెలల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరిగినట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి.

ఇటీవల నల్లబెల్లి –నర్సంపేట జాతీయ రహదారిపై రాత్రి వేళ డీసీఎం ఆగిపోవడంతో ఎలాంటి సూచికలు పెట్టకుండా రోడ్డుపైనే నిలిపి ఉంచాడు. ఈ క్రమంలో ఆ మార్గంలో బైక్‌పై వెళ్తున్న దుగ్గొండి మండలం భూపతి మల్లంపల్లి గ్రామానికి చెందిన రాజేశ్ డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కొద్ది రోజుల క్రితం కమలాపూర్ మండలం అంబాలకు చెందిన కుమ్మరి కొమురయ్య బైక్‌పై ఆత్మకూరు జాతీయ రహదారిపై వెళ్తుండగా వ్యాన్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ అదే రాత్రి చనిపోయాడు. వరంగల్ కరీమాబాద్‌కు చెందిన జొమాటో డెలివరీ బాయ్ బైక్‌పై హనుమకొండ బస్‌స్టేషన్ జంక్షన్ రెస్టారెంట్ నుంచి టిఫిన్ డెలివరీ చేయడానికి బాలసముద్రం వెళ్తుండగా హయగ్రీవాచారి మైదానం ముందు ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు.

పది నెలల్లో 354మంది మృతి..

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ 25 వరకు 1,146 రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు పోలీసుల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ప్రమాదాల్లో మొత్తం 354 మంది మృతి చెందారు. 71మందికి తీవ్ర గాయాలు, 1,024 మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. మద్యం తాగి డ్రైవింగ్ చేయడం, ఓవర్ స్పీడ్, ఓవర్‌టేక్, నిద్ర మత్తు, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్లే ప్రమాదాలు ఎక్కువగా జరిగినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. చనిపోయిన మొత్తం 354మందిలో సుమారు 260 మందికి పైగా ద్విచక్రవాహనదారులు ఉన్నారు. హెల్మెట్ ధరించక పోవడంతో ఎక్కువ మంది మృత్యువాతపడ్డారు. కమిషనరేట్ పరిధిలో రోజుకు కనీసం 3వేలకు పైగా వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతున్నట్లు ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. హనుమకొండ జిల్లాలోనే 5,03,851 వాహనాలు ఉన్నాయి. వరంగల్, జనగామ జిల్లాలు, బయటి నుంచి వచ్చే వాహనాలు కలిసి రోజుసుమారు 6లక్షల వరకు కమిషనరేట్ పరిధిలో తిరుగుతుంటాయని ఆర్టీఏ అధికారులు అంటున్నారు. ఈ క్రమంలో రోజుకు 5నుంచి 10వరకు ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తున్నది. వరంగల్ నగరంలో మాత్రమే ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేస్తున్నారు. నగర శివారు ప్రాంతాలు, రహదారులపై లా ఆర్డర్ పోలీసులు పని ఒత్తిడి కారణంగా రెగ్యులర్‌గా తనిఖీలు చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక మిడ్‌నైట్‌లో ఎక్కువగా యువకులు ఓవర్ స్పీడ్‌తో బైక్ రైడింగ్ చేస్తున్నారు.

పోలీసులు, ఆర్టీఏ అధికారుల మధ్య లోపించిన సమన్వయం..

రోడ్డు ప్రమాదాల నివారణ విషయంలో పోలీసులు, ఆర్టీఏ అధికారుల మధ్య సమన్వయం లోపించినట్లు పలు ఘటనలను బట్టి స్పష్టమవుతున్నాయి. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగినపుడు మాత్రమే అధికారులు హడావుడి చేసి చేతులు దులుపుకుంటున్నారు. వరంగల్–ఖమ్మం రహదారిలో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. అలాగే వరంగల్–ములుగు, కరీంనగర్, హైదరాబాద్, నర్సంపేట రూట్లల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మూల మలుపులు వద్ద సూచికలు ఏర్పాటు చేయపోవడం, తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే చోట నివారణ చర్యలు తీసుకోకపోవడం, ఓవర్ లోడింగ్, వాహనాల కండిషన్‌పై దృష్టి పెట్టకపోవడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తున్నది. ఇక ట్రాఫిక్ పోలీసులు వాహనాలపై జరిమానాలు విధించడం తప్ప రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గ్రూప్-3 పరీక్ష ప్రారంభం

53.47 శాతం మంది హాజరు.. నేడు మూడో పేపర్..

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 17 : గ్రూప్–3 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన మొదటి పరీక్షకు మొత్తం 32,864 మంది అభ్యర్థులకు 17,572 (53.47) మంది హాజరుకాగా, 15,292 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన రెండో పరీక్షకు 32,864 మంది అభ్యర్థులకు 17,437 (53.06) హాజరుకాగా 15,427 మంది గైర్హాజరయ్యారని సంబంధిత అధికారులు తెలిపారు.

పరిశీలించిన కలెక్టర్..

గ్రూప్ –3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. ఆదివారం బాలసముద్రంలోని శ్రీనివాస గురుకుల్ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏమైనా సమస్యలు తలెత్తితే అధికారుల దృష్టికి తీసుకురావాలని పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్‌కు సూచించారు.

మిగిలిన పనులు పూర్తి చేయాలి

కాళోజీ కళాక్షేత్రంలో మిగిలిన పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. ఆదివారం బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి సందర్శించి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఈ నెల 19న కళాక్షేత్రం ప్రారంభోత్సవం చేస్తున్నారని తెలిపారు. ఫినిషింగ్, ఎలక్ట్రిసిటీ, ఫౌంటెన్ మొదలైన పనులు రేపటికల్లా పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలన్నారు. అనంతరం హయగ్రీవాచారి మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను సందర్శించి అక్కడ ఉన్నతాధికారులతో చర్చించారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ వెంకటరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు.

నేటి నుంచి ఫారెస్ట్ భూముల సర్వే

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 17 : ఫారెస్ట్ భూములు గుర్తించి హద్దులు పెట్టేందుకు ఈ నెల 18 నుంచి సర్వే చేయనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ధర్మసాగర్ మండలంలోని దేవునూరు, ముప్పారం గ్రామాల్లో, వేలేరు మండలంలోని ఎర్రవెల్లి, ఎల్కతుర్తి మండలంలోని దామెర, భీమదేవరపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఇనుపరాతి గుట్టల్లోని ఫారెస్ట్ భూముల్లో నోటిఫై చేసిన సర్వే నంబర్లలో హద్దులను నిర్ణయిస్తామని తెలిపారు. ఆయా గ్రామాల రైతులు సర్వే టీంలకు సహకరించాని కోరారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

రవి (ఫైల్)

కమలాపూర్, నవంబర్ 17 : మండలంలోని మాదన్నపేట గ్రామ శివారులో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి మంద రవి (48) మృతి చెందినట్లు సీఐ హరికృష్ణ ఆదివారం తెలిపారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం ధర్మరాజుపల్లి గ్రామానికి చెందిన రవి వరిగడ్డి కట్టల కోసం కొండ్ర కుమారస్వామి ట్రాక్టర్‌పై మాదన్నపేటకు వెళ్లాడు. గడ్డి కట్టలను తీసుకుని తిరిగి వెళ్తుండగా మాదన్నపేట శివారులో సమ్మక్క గద్దెల వద్ద కుమార స్వామి ట్రాక్టర్‌ను అతివేగంగా నడపడంతో రవి కిందపడగా, ట్రాక్టర్ తలపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

బల్దియా గ్రీవెన్స్ రద్దు

వరంగల్, నబంబర్ 17 : బల్దియా ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనతో తెలిపారు. పరిపాలనా పరమైన కారణాలతో గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు రావొద్దని కోరారు.

జిల్లా గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 17 : హనుమకొండలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి శశిజా దేవి, డిప్యూటీ లైబ్రేరియన్ కరుణకుమారి, గ్రేడ్–2 లైబ్రేరియన్ మన్సూర్, గ్రేడ్–3 లైబ్రేరియన్ పురుషోత్తంరాజు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్‌కుమార్, టైపిస్ట్ కుమారస్వామి, కొండయ్య పాల్గొన్నారు.

బల్దియా పాలనా భవన నిర్మాణానికి రూ.32.50 కోట్లు

జీవో జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం

వరంగల్, నవంబర్ 17 : గ్రేటర్ కార్పొరేషన్ కార్యాలయంలోని ఇండోర్ స్టేడియం ముందు నిర్మించనున్న పాలనా భవనానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఐదు అంతస్తులతో నిర్మించే ఈ భవనానికి రూ. 32.50 కోట్లు నిధులు మంజూరు చేస్తూ సోమవారం రాత్రి రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దాన కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉత్సాహంగా స్విమ్మింగ్ పోటీలు

స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 17 : ఉమ్మడి వరంగల్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలసముద్రంలో నిర్వహించిన స్విమ్మింగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సుమారు 40 మంది ఇందులో పాల్గొన్నారని స్విమ్మింగ్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సెక్రటరీ మంచాల స్వామిచరణ్ తెలిపారు. తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 7, 8 తేదీల్లో భూపాలపల్లిలోని సింగరేణి స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించే 9వ తెలంగాణ వింటర్ ఇంటర్ డిస్ట్రిక్ట్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ కోసం ఎంపికల నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో ఎంపికైన వారు డిసెంబర్ 27 నుంచి 29 వరకు విజయవాడలోని గాంధీనగర్, మున్సిపల్ కార్పొరేషన్ స్విమ్మింగ్‌పూల్‌లో జరిగే 35వ సౌత్‌జోన్ అక్వాటిక్ చాంపియన్‌షిప్ సబ్ జూనియర్స్ అండ్ జూనియర్స్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్, కోచ్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

సీఎం పర్యటనను అడ్డుకుంటాం

- కులవివక్ష చూపిస్తే సహించం
- విద్యార్థి సంఘాల డిమాండ్

హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 17 : హనుమకొండలో నిర్మించిన కాళోజీ కళా క్షేత్రంలో కళాకారుల విగ్రహాలు ఏర్పాటు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తే ఊరుకోమని విద్యార్థి నాయకులు హెచ్చరించారు. ఈ నెల 19న ప్రారంభానికి వస్తున్న సీఎం పర్యటనను అడ్డుకుంటామన్నారు. ఆదివారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళలు, కళారూపాలకు సంబంధం లేని కాళోజీ నారాయణరావు పేరుపెట్టడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. నాలుగు నెలలుగా కళాక్షేత్రంలో కళాకారుల విగ్రహాలను పెట్టాలని, పేరు మార్చాలని ఉద్యమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, కమిషనర్‌ను కలిసినా ఫలితం లేదన్నారు. కళాకారుల విగ్రహాలను పెట్టకపోవడం వెనకాల కచ్చితంగా కుల వివక్ష కనిపిస్తుందని, కాళోజీ నారాయణరావు ఆధిపత్య వర్గానికి సంబంధించిన వ్యక్తిగనుకనే కళాక్షేత్రంలో కళలకు సంబంధం లేకపోయినా ఆయన విగ్రహాన్ని, ఆయన పేరు పెట్టారని విద్యార్థి నాయకులు మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఓట్లతో వరంగల్‌లో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సామాజిక వర్గానికి చెందిన కళాకారుల డిమాండ్లను పట్టించుకోవడం లేదన్నారు. ప్రజాపాలన పేరుచెప్పి కులవివక్ష చూపితే, రానున్న స్థానిక సంస్థలు, మున్సిపాలిటీ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిస్తామని వారు హెచ్చరించారు. నాయకులు దూడపాక నరేశ్, కన్నం సునీల్, అక్రమ్, కుమార్, నాని, అర్జున్, ప్రణయ్, బన్నీ పాల్గొన్నారు.

ఇంకా రాని రేషన్ బియ్యం

అసహనం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

ఐనవోలు, నవంబర్ 17 : గడువు ముగిసినా మండలంలోని కొన్ని రేషన్ దుకాణాలకు బియ్యం ఇంకా రాలేదు. నిబంధనల ప్రకారం ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీ జరగాలి. కానీ 15వ తేదీ దాటినా మండలంలోని నందనం, రాంనగర్, లింగమోరిగూడెం, ఉడుతగూడెం, గర్నిశపల్లి, కక్కిరాలపల్లి, ఐనవోలులోని సుమారు 13 షాపులకు రేషన్ బియ్యం రాకపోవడంతో కార్డుదారులు అసహనం వ్యక్తం చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్లలోనే బియ్యం అందుబాటులో లేకపోవడంతో రాలేదని తెలిసింది.

ఉద్యమకారుడి కుటుంబానికి ఆర్థికసాయం

కాజీపేట, నవంబర్ 17 : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన తెలంగాణ రైల్వే ఉద్యమకారుడు నాగరాజు కుటుంబానికి తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం రూ.18వేల ఆర్థికసాయం అందజేశారు. తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ కొండ్ర నర్సింగరావు, కో–కన్వీనర్లు అనుమాల శ్రీనివాస్, భాస్కర్, వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో స్నేహితుడి కుటుంబానికి..

హసన్‌పర్తి : గ్రేటర్ 65వ డివిజన్ మునిపల్లికి చెందిన కుమారస్వామి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కాగా, అతడి పదో తరగతి స్నేహితులు కుమారస్వామి కుటుంబానికి రూ.15వేలు అందజేశారు. కార్యక్రమంలో కరుణాకర్, రాకేశ్, సురేశ్, సతీశ్, రాజేశ్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులను అందిస్తున్న మాజీ జడ్పీటీసీ చాడ సరితారెడ్డి

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వేలేరు, నవంబర్ 17 : మండలంలోని సోడాషపల్లి గ్రామానికి చెందిన జినుకల రవి, కవితకు మాజీ జడ్పీటీసీ చాడ సరితారెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం అందించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కృషితో రవికి రూ.21వేలు, కవితకు రూ.15వేల విలువైన చెక్కులు మంజూరైనట్లు ఆమె తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు మేరుగు ప్రభాకర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, వెన్నం సంపత్‌రెడ్డి, పల్లా శ్రీనివాస్‌రెడ్డి, బుట్టి రమేశ్ పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 17 : కలెక్టరేట్‌లో సోమవారం జరగనున్న ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. 19న ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులందరూ ఏర్పాట్లలో నిమగ్నమైనందున ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే సోమవారం యథావిధిగా నడుస్తుందని, ప్రజలు గమనించాలని కోరారు.

ఇంజినీరింగ్ విద్యార్థికి ఎమ్మెల్యే ఆర్థిక చేయూత

ఐనవోలు, నవంబర్ 17 : ఇంజినీరింగ్‌లో సీట్ సాధించిన విద్యార్థికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆర్థిక చేయూతనందించారు. మండలంలోని వనమాలకనపర్తి గ్రామానికి చెందిన సింగారపు లాస్య ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయచూర్‌లో ఎన్ఐటీ కళాశాలలో ఇంజినీరింగ్‌లో సీట్ సాధించింది. కాగా, లాస్య కళాశాలలో చేరడానికి ఫీజు కట్టలేని పేదరికంలో ఉంది. దీంతో లాస్య కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే నాగరాజును కలిసి విషయం తెలుపగా, స్పందించిన ఆయన తన సొంత డబ్బుల నుంచి రూ.1 లక్ష, ఎమ్మెల్యే మిత్రుడు కరణ్‌రాజు రూ.1 లక్ష, 14వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్ రూ.5 వేలు, మిగిలిన నాయకులు, కార్యకర్తలు తమ వంతు ఆర్థిక సహాయాన్ని విద్యార్థినికి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి లాస్య, తల్లి విమల ఎమ్మెల్యే నాగరాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మల్లన్న ఆర్చి నిర్మాణానికి రూ. 1.5లక్షల విరాళం

ఐనవోలు, నవంబర్ 17 : ఐనవోలు మల్లికార్జునస్వామి ఆర్చి నిర్మాణానికి దాతలు రూ. 1.5లక్షల విరాళం అందజేశారు. మండలంలోని పున్నేల్ క్రాస్ వద్ద ఐనవోలు మల్లికార్జునస్వామి దేవాలయ పాలకవర్గం ఆధ్వర్యంలో దాత సహకారంతో నూతన ఆర్చి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ మేరకు మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన 'మల్లికార్జున టీం' సభ్యులు ఆదివారం ఆలయ బాధ్యులకు చెక్కు అందజేశారు. చెక్కు అందజేసిన వారిలో మల్లికార్జున టీం సభ్యులు పెండ్లి తిరుపతి, కొట్టం రాజు, కొట్టం మోహన్, పెండ్లి నవీన్, కడ్డూరి సంతోష్, పెండ్లి ప్రశాంత్, ఆకుతోట రాజు, పెంతల అశోక్ తదితరులు ఉన్నారు.

సుందరం హోమ్

నమోదిత కార్యాలయం: నెం. 21, పటుల్లాస్ రోడ్, చెన్నై–600 002.
కార్పొరేట్ ఆఫీస్: సుందరం టవర్స్, నెం. 46, వైట్స్ రోడ్, చెన్నై–600 014, ఫోన్: 044–2851 5267.
శాఖ కార్యాలయం: 1వ అంతస్తు, ''కండకట్ల గేట్‌వే'', KUC క్రాస్ రోడ్, నయీమ్ నగర్, హన్మకొండ, వరంగల్–506009. ఫోన్: 0870–2441244

అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్షన్ 13(2)తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలు వినియోగించి **సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** అధీకృత అధికారి **29-07-2024** తేదీగల ఒక డిమాండ్ నోటీసు జారీ చేసి, నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా నోటీసులో తెలిపిన మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సిందిగా రుణగ్రహీతను మరియు సహ–రుణగ్రహీతలను కోరియున్నారు.
నిర్దేశిత సమయంలోగా రుణగ్రహీత(లు) మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టపు సెక్షన్ 13(4) క్రింద కలిగిన అధికారాలు వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని అధీకృత అధికారి స్వాధీనం చేసుకొని ఉన్నారు.
30/12/2024న 14.30 గంటల వరకు ప్రజల నుండి సీల్డ్ బిడ్లు కోరుతూ ఎటువంటి ఆవలంబన లేకుండా **''ఎలా ఉన్నది అలా'' మరియు ''ఏది ఉంటే అది''** నిబంధనపై సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 & 9 క్రింద దిగువ పట్టికలో పూర్తిగా వివరించబడిన ఆస్తి అమ్మబడునని ఇందుమూలముగా ప్రజలకు తెలియచేయడమైనది. వేలం అమ్మకంలో పాల్గొనదలచిన వారు తమ బిడ్లను దిగువ సంతకందారుకు **30/12/2024**, 14.30 గంటల వరకు లేదా ఆలోగా ఆఫర్ ఫర్ సేల్ ఆఫ్ అస్సెట్స్ A/c. **శ్రీ నాగరాజు ఓడెల** అని పైన వ్రాసి సీల్డ్ కవర్లలో ఆథరైజ్డ్ ఆఫీసర్, సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, నెం.23, 2వ అంతస్తు, క్యాథడ్రల్ గార్డెన్ రోడ్, నుంగంబాక్కం, చెన్నై–600034కు అడ్రస్ చేసి KYC డాక్యుమెంట్లతో RPAD ద్వారా/స్వయంగా పంపవలెను. లోన్ అకౌంట్ నెం.**WGL20220077**, **శ్రీ నాగరాజు ఓడెల** కొరకు బయానాగా రిమార్క్‌తో అకౌంట్ పేరు: సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, అకౌంట్ నెం.00040350000905, బ్యాంక్ పేరు: HDFC బ్యాంక్ లిమిటెడ్, ITC సెంటర్–అన్నాసాలాయ్, చెన్నై–600002, A/c– కరెంట్ అకౌంట్, IFSC కోడ్–HDFC0000004కు చెల్లించిన RTGS వివరాలతో లేదా బయానా మొత్తం కొరకు సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరున డిడి ద్వారా బిడ్లు సపోర్ట్ చేయబడతాయి. **30/12/2024** న 14.30 గంటల తరువాత స్వీకరించిన బిడ్లు నిరాకరించబడును. RPAD ద్వారా లేదా స్వయంగా **30/12/2024** న 14.30 గంటల వరకు స్వీకరించబడిన సీల్డ్ బిడ్లు **30/12/2024** న 15.00 గంటలకు దిగువ పేర్కొన్న ప్రదేశం వద్ద తెరువబడును. అమ్మకం నిర్ధారణ అందిన తేదీ నుండి 15 రోజులలోగా విజయం పొందిన బిడ్డరు మిగులు మొత్తాన్ని చెల్లించవలెను. పైన తెలిపిన విధంగా మిగులు మొత్తం డిపాజిట్ చేసిన తర్వాతనే అమ్మకం పూర్తవుతుంది.

రుణగ్రహీత & సహ–రుణగ్రహీత పేరు మరియు చిరునామా	సెక్యూర్డ్ రుణం (రూ.)	ఆస్తి కొరకు నిర్ణయించిన రిజర్వు ధర	టైటిల్ పరిశీలన ప్రదేశం
శ్రీ నాగరాజు ఓడెల (రుణగ్రహీత), ఇం.నెం.2–9–189/2, వికాస్ నగర్ రోడ్ నెం.15, హనుమాన్ గుడి సమీపాన, హన్మకొండ, వరంగల్–506001. **నాగరాజు ఓడెల (ఎంప్లాయర్)**, గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ సైనిక్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, టీచర్స్ కాలనీ జిల్లా, సైనిక్ వెల్ఫేర్ ఆఫీస్, వరంగల్–506001. **శ్రీ నాగరాజు ఓడెల (ఆస్తి–1)**, ఇం.నెం.2–9–189/2, సర్వే నెం.133 మరియు 134, వికాస్ నగర్ రోడ్ నెం.15, వడ్డేపల్లి రెవెన్యూ గ్రామం, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, హన్మకొండ మండలం, వరంగల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం–506001. **శ్రీమతి శైలజ ఓడెల (సహ–రుణగ్రహీత)**, ఇం.నెం.2–9–189/2, వికాస్ నగర్ రోడ్ నెం.15, హనుమాన్ గుడి సమీపాన, హన్మకొండ, వరంగల్–506001.	రూ. 31,40,612/– (ముప్పై ఒక్క లక్షల నలబై వేల ఆరు వందల పన్నెండు రూపాయలు మాత్రమే) 18–11–2024 నాటికి + వాస్తవ చెల్లింపు తేదీ వరకు తదుపరి వడ్డీ + ఇతర ఖర్చులతో	రూ. 51,72,000/– (యాభై ఒక్క లక్షల డెబ్బై రెండు వేల రూపాయలు మాత్రమే) బయానా బిడ్ మొత్తంలో 25%	సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, KUC క్రాస్ రోడ్, నయీమ్ నగర్, హన్మకొండ, వరంగల్–506009. బిడ్ తెరుచు ప్రదేశం సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, నెం.23, 2వ అంతస్తు, క్యాథడ్రల్ గార్డెన్ రోడ్, నుంగంబాక్కం, చెన్నై–600034 బిడ్ తెరుచు తేది మరియు సమయం 30/12/2024 @ 15:00 Hrs

సెక్యూర్డ్ ఆస్తి వివరణ: జాయింట్ సబ్ రిజిస్ట్రార్–11 (వరంగల్ ఫోర్ట్) అధికార పరిధిలో, మరియు వరంగల్ రిజిస్ట్రార్ కార్యాలయం జాయింట్ సబ్‌రిజిస్ట్రార్–1 మరియు 2 లోకి వచ్చే రిజిస్ట్రేషన్ జిల్లా వరంగల్ మరియు సబ్ జిల్లా వరంగల్ అధికార పరిధిలో, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, హన్మకొండ, వికాస్ నగర్ వద్ద గల, వరంగల్ సిటీ మరియు అర్బన్ జిల్లా, హన్మకొండ మండలం, వడ్డేపల్లి రెవెన్యూ గ్రామంలోని సర్వే నెం.133 మరియు 134లో 66.88 చ.మీటర్లకు సమానమైన 80.00 చ.గజాలు విస్తీర్ణం 350.00 చ.అ. ప్లింత్ ఏరియాచే కవర్ చేయబడిన, GWMC ఇం.నెం.2–9–189/2 గల ఖాళీ ప్రదేశంతో ప్రస్తుతమున్న ఆర్‌సిసి రూఫ్ స్ట్రక్చర్ ఇంటి ఆస్తి,
సరిహద్దులు: తూర్పు: ఆకుతోట అనిత ఖాళీ భూమి, పడమర: ఆర్.రాజన్న ఇల్లు, ఉత్తరం: చంద్రయ్య ఇం.నెం.2–9–181, దక్షిణం: 30–0 వెడల్పు రోడ్.